హైదరాబాద్ వార్త













# నగరంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

## -చర్చిల వద్ద ప్రత్యేక కార్యక్రమాల నిర్వాహణ
## -క్రీస్తు సందేశాన్ని భక్తులకు తెలియజేసిన పాస్టర్లు, బిషప్‌లు

**హైదరాబాద్, డిసెంబరు 25,ప్రభాతవార్త :** క్రిస్మస్ పండుగను గ్రేటర్ హైదరబాద్‌లో ఘనంగా జరుపుకున్నారు క్రైస్తవ మతస్థులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకల సందర్భంగా పాస్టర్‌లు, క్రైస్తవ మతపెద్దలు, బిషప్‌లు క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందజేశారు. రంగురంగుల దీపాలతో, నూతన వస్త్రాలతో చిన్నారులు ఆడిపాడి అలరించారు. నారాయణగూడలోని 1969 నాటి బాపిస్ట్ చర్చిని.. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆదర్శనగర్ బ్యాడ్‌లాండ్‌లోని చర్చిలో అర్ధరాత్రి నుంచే పెద్దఎత్తున క్రిస్టియన్లు.. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఎల్ఈడీ దీపాలతో చర్చి పరిసర ప్రాంతాలు అలరిస్తున్నాయి. సమాజంలో శాంతి, సహనంతో ప్రజలందరూ జీవించాలని కాంక్షించారు. అలాగే సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్, వెస్లీ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏసుప్రభు జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు చర్చిలకు తరలి వచ్చారు. క్రైస్తవ మతపెద్దలు బిషప్ లు క్రీస్తు సందేశాన్ని అందజేశారు. క్రీస్తు జననానికి సంబంధించిన వృత్తాంతాన్ని, పశువుల పాక.. క్రిస్మస్ ట్రీలు, చర్చిలో విశేషాలంకరణలతో శోభాయమానంగా అలరించాయి. ప్రభు ఆశీస్సులతో ప్రపంచం సుఖ శాంతులతో ఉండాలని మతపెద్దలు ఆకాంక్షించారు.

# పీర్జాదిగూడలో అక్వేరియం దుకాణాలపై ఎస్ఓటి పోలీసుల దాడి..!

## -భారీగా నక్షత్ర తాబేళ్లు స్వాధీనం .. ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



పీర్జాదిగూడలో నక్షత్ర తాబేళ్లు విక్రయిస్తున్న దుకాణంపై దాడి చేసి పట్టుకున్న దృశ్యం.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నక్షత్ర తాబేళ్ల దృశ్యం

**ఉప్పల్, డిసెంబరు 25 ప్రభాతవార్త :** నిబంధనలకు విరుద్ధంగా నక్షత్ర తాబేళ్లు విక్రయిస్తున్న దుకాణాలపై ఎస్ఓటి పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. పీర్జాదిగూడ, మేడిపల్లి ప్రాంతాల్లో బుధవారం మల్కాజిగిరి ఎస్ఓటి పోలీసులు రెండు అక్వేరియం దుకాణాలపై దాడి చేసి అరుదుగా లభించే నక్షత్ర తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మలక్‌పేట ప్రాంతానికి చెందిన మహ్మద్ సిరాజ్(39) న్యూ షైన్ అక్వేరియం బిజినెస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇతనితోపాటు పీర్జాదిగూడ ఆదర్శనగర్‌కు చెందిన పేమస్ అక్వేరియం నిర్వహకుడు షేక్ జానీ(50), ఎపికి చెందిన విజయ్‌కుమార్‌లు కలిసి వివిధ రకాల చేపలు, పక్షులను విక్రయిస్తుంటారని తెలిపారు. బుధవారం పోలీసులకు అందిన సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్ఓటి పోలీసులు అక్వేరియం దుకాణంపై దాడి చేసి షేక్ జానీ అక్రమంగా నక్షత్ర తాబేళ్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి అతని వద్ద నుంచి ఐదు నక్షత్ర తాబేళ్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఉప్పల్ అటవీశాఖ అధికారులను సంప్రదించి నక్షత్ర తాబేళ్లు మార్కెట్‌లో విక్రయించ వచ్చా లేదా నిర్ధారించుకున్నారు. షేక్ జానీని ప్రశ్నించగా సిరాజ్ అహ్మద్ అనే వ్యక్తి పేరు చెప్పినట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారులు, ఎస్ఓటి పోలీసులు అక్వేరియం సెంటర్‌లపై దాడి చేసి న్యూషైన్ అక్వేరియంలో 160 నోస్ రెడ్ ఇయర్డ్ స్లైడర్ తాబేళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతని గోదాంలో మొత్తం 281 తాబేళ్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిని ప్రశ్నించగా ఎపిలోని విజయ్‌కుమార్ అనే వ్యక్తి నుంచి వీటిని అక్రమంగా తరలించినట్లు అంగీకరించారని తెలిపారు. ఎపి నుంచి వీటిని తెచ్చి నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీటిని విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి 218 నక్షత్ర తాబేళ్లతోపాటు, 160 రెడ్ సొలిడార్ తాబేళుతోపాటు, నాలుగు సెల్‌పోన్లు స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ రూ.64లక్షలు ఉంటుందని తెలిపారు. అనంతరం తాబేళ్లను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. రాచకొండ సిపి జి.సుధీర్‌బాబు పర్యవేక్షణలో ఎస్ఓటి డిసిపి ఎ.రమణారెడ్డి, అడిషనల్ డిసిపి డా.ఎన్.నరసింహారెడ్డి, ఎసిపి శ్రీకాంత్‌గౌడ్, సిఐ పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ పి.వాసుదేవ్,ఇతర సిబ్బంది కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అంబరాన్నంటిన చిన్నారుల నృత్యవిన్యాసాలు

**రవీంద్రభారతి, డిసెంబరు 25 ప్రభాతవార్త :** మాస్టర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చిన్నారి విద్యార్థుల నృత్యవిన్యాసాలు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంబరాన్నంటాయి. నాణ్యమైన విద్య అనే ప్రధాన అంశంతో జరుపుకున్న నేటి పాఠశాల వార్షికోత్సవ వేడుకలు విద్య విషయంలో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి లక్ష్యాలను ఒకదానితో ఒకటిగా అనుసంధానం కావిస్తూ సందేశాత్మకంగా జరిగి అందరినీ ఆలోచింపజేసి ఆకట్టుకున్నాయి. చిన్నారుల వివిధ నృత్యాంశాలతో శాస్త్రీయ, జానపద రీతుల్లో సాగిన నాట్యప్రదర్శనలు ఆకాశమే హద్దుగా హోరెత్తించి ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ ప్రోగ్రామ్ కమిటీ సభ్యుడు (తెలంగాణ) విశ్వకర్మ డిఆర్‌కె., పాఠశాల ప్రిన్సిపాల్ ఇ.మాధవి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు తదితరులతో కలిసి గడచిన విద్యా సంవత్సరంలో విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి




విద్యార్థుల నృత్యప్రదర్శనల్లో ఒక దృశ్యం

శుభాశీస్సులందజేశారు. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో విచ్చేయగా, విద్యార్థుల వివిధ ప్రదర్శనలు వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేశాయి.

# రేషన్‌కార్డులు ఇచ్చేనా..?

- -పెండింగ్‌లోనే లక్షల్లో దరఖాస్తులు
- -ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- -సంక్షేమ ఫలాలు అందక ఇబ్బందులు
- -కాంగ్రెస్ సర్కార్‌పై గంపెడాశలతో ప్రజలు






**హైదరాబాద్,డిసెంబరు 25,ప్రభాతవార్త:** కొత్త ప్రభుత్వం ఏర్పాడి ఏడాది గడిచిపోవడం.. ఇటీవల సంక్రాంతి తర్వాత రేషన్‌కార్డులు ఇస్తారన్న చర్చ జరుగుతండటంతో ప్రజల్లో కొంగొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఆరుగ్యారెంటీ సంక్షేమ పథకాల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని తక్షణమే అమలు చేయాలని కోరుతున్నారు. కార్డులు లేక ఏళ్లతరబడి సంక్షేమ పథకాలకు దూరమయ్యాయమని, రేషన్‌బియ్యం పొందలేకపోతున్నామని పలువురు అంటున్నారు. నూతన ప్రభుత్వమైన తమకు రేషన్‌కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే నగరంలో కార్డులు లేక చాలామంది ఇబ్బంది పడుతున్నారు. కొత్తకార్డులు పొందేందుకు కొందరు, ఉన్నకార్డుల్లో మార్పులు చేర్పులకు మరికొందరు దరఖాస్తు చేసుకుని ఏళ్లుగడుస్తున్నాయి. అయినా గత ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని దరఖాస్తు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తకార్డులు జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మళ్లీ మోక్షం కలుగలేదు. ఈక్రమంలో 2020లో లాక్‌డౌన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.2వేల నగదు అందించారు. రేషన్‌కార్డు లేకపోవడంతో చాలా మంది ప్రభుత్వ సాయం అందకుండా పోయింది. ఈక్రమంలో లాక్‌డౌన్ ముగిసిన తర్వాత 2021 జూలైలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేసినట్టే చేసి ఉన్నట్టుండి ఆప్రక్రియను నిలిపివేసింది. దీంతో చాలామందికి కొత్తకార్డులు అందకుండా పోయాయి. కొన్నింటికి మాత్రమే మోక్షం కలగగా అధిక సంఖ్యలో దరఖాస్తులు పేరుకుపోయాయి.

**రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ పథకాలు అందక ..**

కొత్తరేషన్‌కార్డుల మంజూరులో గత ప్రభుత్వం వ్యవహరించిన విధానంపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. కనీసం ఎన్నికల ముందైన రేషన్‌కార్డులు ఇస్తారని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురైంది. ఎన్నికలకు ముందు తెరపైకి తెచ్చిన గృహలక్ష్మీ, బిసిలకు రూ.లక్షల ఆర్థిక సాయం, డబుల్‌బెడ్‌రూం,కళ్యాణలక్ష్మీ తదితర పథకాలకు రేషన్ కార్డులనే ప్రమాణికంగా తీసుకోవడంతో కొత్తగా పెళ్లై రేషన్‌కార్డు రానివారు అనర్హులు కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో రేషన్‌కార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో కూడా ఈకార్డులే కీలకమయ్యాయి.దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యానికి రేషన్‌కార్డులు తప్పనిసరి కాగా వాటిని వీలైనంత త్వరలో మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**సంక్రాంతి తర్వాత మోక్షం..**

వచ్చే నెల సంక్రాంతి తర్వాత అర్హులకు కొత్త రేషన్ కార్డులను జారీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు పాత పద్ధతిలో కాకుండా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన రేషన్ కార్డులను అర్హులకు ఇవ్వాలని నిర్ణయించింది. గ్రేటర్ హైదరాబాద్ లో కొన్ని నెలలుగా రేషన్ కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే వారిలో ఎంత మంది రేషన్‌కార్డుల అర్హులు ఉన్నారో క్షేత్రస్థాయి పరిశీలన తరవాత స్పష్టత వస్తుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. గతంలో కూడా రేషన్ కార్డుల జారీ ప్రక్రియ తరచుగా జరిగింది. ఆతర్వాత రేషన్ కార్డుల జారీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఏకీకృతం చేసింది. దీంతో ఎప్పటికప్పుడు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడే కార్డులు జారీ చేస్తోంది. అధిక శాతం హైదరాబాద్ జిల్లా పరిధిలోనే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు అంటున్నారు. కొత్తగా జారీ చేసే రేషన్‌కార్డులో ఎలక్ట్రానిక్ చిప్‌ను ఏర్పాటు చేయాని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఆచిప్‌లో కుటుంబ సభ్యుల సంఖ్య, చిరునామా ఇతర సమాచారం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం గ్రేటర్‌లోని మూడు జిల్లాల్లో సుమారు 17.21 లక్షల కార్డులు ఉన్నాయి. అయితే పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల్లో లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు అర్హులు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.




**హైదరాబాద్‌లో ట్రాఫిక్ అసిస్టెంట్‌గా విధుల్లో ఉన్న ట్రాన్స్‌జెండర్**

## బుక్‌ఫెయిర్‌ను సందర్శించిన దర్శకుడు త్రివిక్రమ్



మన సినిమా ఫస్ట్‌రీల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్

**ముషీరాబాద్, డిసెంబర్ 25, ప్రభాతవార్త:** ఎన్టీఆర్ స్టేడియంలో పండుగలా కొనసాగుతున్న పుస్తక ప్రదర్శనకు పుస్తకాభిమానులు తరలివస్తున్నారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం ప్రముఖ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ బుక్‌ఫేర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన రెంటాల జయదేవ రచించిన మన సినిమా ఫస్ట్ రీల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. పుస్తకం గురించి ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమా మొదటి రోజుల గురించి రాసిన పరిశోధనాత్మక పుస్తకమని, సినిమాలపై ఆసక్తి ఎక్కువగా ఉండే జయదేవ్ మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కృష్ణకౌండిన్య, ఎమెస్కో విజయ్‌కుమార్, బుక్‌ఫేర్ అధ్యక్షులు యాకూబ్, సెక్రటరీ ఆర్.వాసు, ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి పాల్గొన్నారు. కేంద్రసాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత సంపాదకత్వంలో వచ్చిన కవిత్వ సంకలనం ఉచ్చల జలధితరంగ పుస్తకావిష్కరణ తోపుడు బండి సాధిక్ వేదికపై నిర్వహించారు. కవి, సీనియర్ జర్నలిస్ట్ ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ జిలకర శ్రీనివాస్ ఆవిష్కరించారు.

**అలరించిన బాలోత్సవ్:** బుక్‌ఫేర్‌లో చిన్నారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న బాలోత్సవ కార్యక్రమాలలో భాగంగా బుధవారం అనిల నిర్వహణలో క్రాఫ్ట్స్ వర్క్‌షాప్ జరిగింది. అనంతరం డాక్టర్ అమరవాది నీరజ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. చివరగా బాల సాహితా రచయితల సదస్సుతో బాలోత్సవ కార్యక్రమాలు ముగిశాయి.

**గోరేటి వెంకన్నకు సత్కారం:** పుస్తక స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా కవయిత్రి శిలాలోలిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వాగ్గేయకారుడు గోరేటి వెంకన్నను బుక్‌ఫేర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

# విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి

**బేగంపేట డిశంబరు 25,ప్రభాతవార్త**

బేగంపేట ఎన్‌బిటీనగర్‌లో విద్యుదాఘాతానికి గురై ఒక మహిళ మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఈ సంఘటనపై బేగంపేట పోలీసు స్టేషన్ లో కేసు నమోదైంది. పోలీసుల కధనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బేగంపేట ఎన్ బి టీ నగర్ లోని ఎఫ్ బ్లాకు లో సి.విగ్నేష్ అన్నపూర్ణ దంపతులు నివాసం ఉంటున్నారు. నీటిని పట్టుకున్న అనంతరం మోటారుకు పెట్టిన వైరు ను తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరా అవుతున్న తీగను పట్టుకుని అన్నపూర్ణ (42) విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది.విగ్నేష్ పెయింటర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.బుధవారం ఉదయం ఇంటి కింద గ్రౌండ్‌ఫ్లోర్ లో ఉన్న పంపు వద్ద నీటిని పట్టుకునేందుకు వచ్చారు.ఈ సమయంలో తాగునీటి సరఫరా లో ప్రజెర్‌లో వస్తుండటంతో పైకి ఎక్కడం లేదని,అన్నపూర్ణ(42) తాము ఉంటున్న మొదటి అంతస్తులో విద్యుత్ కనెక్షన్ ఇచ్చి కింద గ్రౌండ్ ఫ్లోర్‌లో తాత్కాలికంగా మోటార్ ఏర్పాటు చేసుకుని నీటిని పట్టుకున్నారు.అనంతరం మోటారు ను తీసివేసే క్రమంలో ముందుగా మోటారుకు ఉన్న విద్యుత్ వైరు ను తొలగించారు.అది గమనించని అన్నపూర్ణ మోటారుకు విద్యుత్ సరఫరా ఇచ్చిన వైరును గమనించకుండా విద్యుత్ సరఫరా ఉన్న తీగను పట్టుకోవడంతో ఆమె విద్యుదాఘాతానికి గురైంది.వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఆమెను పరిక్షించిన వైద్యులు అప్పటికే అన్నపూర్ణ మృతి చెందినట్లు ప్రకటించడంతో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేసినట్లు ఎస్సై జయచందర్ తెలియజేసారు.విగ్నేష్ ,అన్నపూర్ణ దంపతులకు శివాని(13),త్రిష(6)కుమార్తెలు ఉన్నారు.ఈ సందర్భంగా మృతురాలి భర్త విగ్నేష్ మాట్లాడుతూ నీరు పట్టుకునేందుకు వచ్చి తన భార్య ప్రాణాలు పోగొట్టుకోవడం తనకు తీరని నష్టం అని వాపోయారు.ఈ మధ్య కాలంలో తమకు తాగునీటి సరఫరా సరిగా జరగడం లేదని,లోప్రజర్ వస్తుందని,ఎక్కువ సేపు కూడా రావడం లేదని,దీంతో తాము నీటిని వీలైనంత త్వరగా పట్టుకోవాలనే క్రమంలో తన భార్య నిండు ప్రాణాలు కోల్పోవడం తనకు తీరని నష్టం జరిగిందన్నారు.ఇద్దరు పిల్లలు తల్లిని కోల్పోయారని వాపోయారు.తాగు నీటి సరఫరా సక్రమంగా వచ్చి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదని ఆయన వాపోయాడు.

## బూత్ కమిటి నూతన అధ్యక్షుల నియామకం



బూత్ అధ్యక్షులను సత్కరిస్తున్న విఘ్నేశ్వరచారి తదితరులు

**దుండిగల్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ దుండిగల్‌లో 5,6,7,8,9 బూత్ కమిటిలకు నూతన అధ్యక్షులుగా చలకల కిరణ్, నాగేంద్రబాబు, శ్రీధర్‌గౌడ్, ఆకుల శివ, కుమ్మరి రమేష్‌లను నియమించింది. ఈకార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వరచారి ముఖ్య అతిథులుగా విచ్చేసి నూతన కమిటిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నియమనిబంధనలకు కట్టుబడి పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నియమితులైన అధ్యక్షులు మాట్లాడుతూ మాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరసింహాగౌడ్, ఆకుల మల్లేష్, ఆకుల విజయసాయి, భాను, యశ్వంత్, తలారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి



నల్లగుట్ట సాయిబాబా మందిరంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ చీరె సుచిత్ర

**బేగంపేట డిశంబరు 25,ప్రభాతవార్త**

నల్లగుట్ట శ్రీసాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని తాను కోరుకుంటున్నానని,రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీరె సుచిత్ర అన్నారు.బుధవారం రాంగోపాల్‌పేట డివిజన్ పీజీ రోడ్డు నల్లగుట్ట లో ఉన్న సాయిబాబా మందిరంలో ప్రతి సంవత్సరం సాయిబాబా భక్త సమాజం ఆధ్వర్యంలో జరిగే సాయి సప్తాహ (పక్షంరోజుల పాటు జరిగే సాయినామ సంకీర్తనలు) దైవిక కార్యక్రమంలో కార్పొరేటర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన సప్తాహ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుచిత్ర సందీప్,స్వప్న,శ్రీధర్, రఘు,జయకిరణ్,తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న జంపన ప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు ఓల్డ్ మద్‌ఫోర్ట్ శ్రీమణికంఠ భక్తి సమాజం ఆధ్వర్యంలో తీరు తులకాంతమ్మ దేవాలయం ఆవరణలో బుదవారం అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా జరిపారు. అయ్యప్ప నామస్మరణతో, కీర్తనలతో, భజనలతో మారుమ్రోగింది. నీలకంఠస్వామి 18వ పడి పూజ నిర్వహించారు. గురుస్వాములు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, గురుస్వాములు మధు, యాదగిరి, గణేష్, మల్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీదాసాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:** న్యూబోయిన్‌పల్లిలోని పెద్దతోకట్టలోని శ్రీదాసాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష అభిషేకము, లక్షపుష్పార్చనలు జరిపారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యేకు అర్చకులు వేద ఆశీర్వాచనంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ముదిరాజ్‌ల అభ్యున్నతికి అహర్నిశలు కష్టపడతా

### - రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్



బండ్లగూడ కార్పొరేషన్ ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళన పరిచయ వేదికలో ప్రసంగిస్తున్న ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్.

**నార్సింగి, డిసెంబర్ 25 ప్రభాతవార్త :**

ముదిరాజ్ కులస్థుల అభ్యున్నతికి అహర్నిషలు కష్టపడుతానని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చౌడమ్మ దేవాలయం ప్రాంగాణంలో ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళన పరిచ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో ముదిరాజ్‌ల సంఖ్య సింహభాగం ఉందని, కానీ జనాభా దామాషా ప్రకారంగా విద్య,ఉద్యోగ,ఉపాధి, రాజకీయ రంగాలలో ముదిరాజ్‌లకు ప్రాధాన్యత లభించలేదన్నారు. ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉంటేనే మన వాటా మనం సాధించుకోగలుగుతామన్నారు. ముదిరాజ్ కులస్థులంతా తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని పిలపునిచ్చారు. చదువు ఉన్న స్థానం నుంచి మనలను ఉన్నత స్థానాలకు చేరుస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ కులస్థుల అభ్యున్నతికి అమలు చేసే అన్ని పతకాలను మీకు అందేలా నావంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ స్పష్టం చేశారు. పేద ముదిరాజ్ బిడ్డలుంటే వారి ఉన్నత చదువులకు ముదిరాజ్ కార్పొరేషన్ చేయూతనిస్తుందని, ఆర్థికంగా స్థిరపడ్డ ముదిరాజ్‌లు పేదలకు అండగా నిలువాలని సూచించారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న శ్రీశైలం గౌడ్



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఫాదర్ పి.బెన్వర్ తదితరులు



శేరిలింగంపల్లి డివిజన్‌లోని ఆదర్శనగర్ సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ ప్రార్థనలల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

**కొంపల్లి పట్టణంలో**

**కొంపల్లి, డిసెంబర్ 25, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి కొంపల్లి పట్టణంలో బుధవారం యేసుక్రీస్తు ప్రార్ధన మందిరం చర్చిలో క్రిస్మస్ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిధిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ.. క్రైస్తవ బంధువులకు అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, మోహన్ రెడ్డి, చర్చి పాస్టర్ సత్యనారాయణ, గోపాల్ రెడ్డి, అంజి ముదిరాజ్, షేక్ ఖదీర్, జై భైరి గోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ రెడ్డి, క్రైస్తవ బంధువులు పాల్గొన్నారు.

**దుండిగల్ పురపాలిక పరిధిలో..**

**దుండిగల్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక సంఘం పరిధిలోని ఆయా ప్రాంతాల్లోని క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. చర్చిగాగిల్లాపూర్ సెయింట్ ఇగ్నిటస్ చర్చిలో జరిగిన వేడుకల్లో కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ పాల్గొని క్రైస్తవ సోదరసోదరిమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, కరుణ, సేవా, శాంతిలతో కూడిన జీవన మార్గాన్ని అందించిన ఏసుప్రభు ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని అభిలషించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్‌యాదవ్, జోస్పిన్‌సుధాకర్‌రెడ్డి, భరత్‌కుమార్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

**రైల్ నిలయం అంబేద్కర్‌నగర్‌లో**

**కంటోన్మెంట్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:** రైల్ నిలయం అంబేద్కర్‌నగర్‌లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ పి. బెన్వర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తును అనుసరించి నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి బోల్లు కిషన్, చిర్రబోయిన సంతోష్ యాదవ్, పి.ఏసుదాసు, తాటికాయల ఏసురత్నం, డి.బాబురావు, అబ్రహం, రాజు, నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి డివిజన్‌లో...**

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 25 ప్రభాతవార్త :** ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆదర్శనీయమని శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని ఆదర్శనగర్ సీఎస్ఐ వెస్లీ చర్చ్, స్థానికంగా ఉన్న పలు చర్చిలలో స్థానిక పాస్టర్లతో కలిసి రాగం నాగేందర్‌యాదవ్ క్రిస్మస్ వేడుకలలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా దైవజనులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ క్రిస్మస్ కేక్ కట్‌చేసి క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రేమ,సహనం,త్యాగం,దాతృత్వమనే సుగుణాల ఆచరణ ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించిన ఏసుక్రీస్తు జీవనం అందరికీ ఆదర్శనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమతో మెలగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్, స్థానిక పుర ప్రముఖులు,పాస్టర్లు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

### -రాష్ట్ర బీసీ లెక్చరర్స్ సమావేశం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, సుదర్శన్,విఠల్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 25,ప్రభాతవార్త:**

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగాన్ని సవరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.ఈమేరకు బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్ లో రాష్ట్ర బీసీ లెక్చరర్స్ సంఘం సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షులు కె.సుదర్శన్ అధ్యక్షత వహించగా విటల్ సమన్వయం చేశారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు ఉద్యోగ ప్రమోషన్లలో రిజర్వేషన్‌లు కల్పించాలని ఎస్సీ/ఎస్టీలకు ఉన్న మాదిరిగా బీసీలకు కూడా అట్రాసిటీ ప్రొటెక్షన్ కల్పించాలన్నారు. గత 70 సంవత్సరాల నుండి జరుగుతున్న అన్యాయం గురించి పోరాడడానికి నిర్ణయం తీసుకున్నామని. బీసీ విద్యార్థులసంక్షేమ ఉన్నత చదువులకు ప్రోత్సాహం, ఇతర దేశాలలో చదివే పిల్లలకు ప్రోత్సహాకాలు స్కాలర్షిప్ అందించాలన్నారు. అలాగే బీసీ హాస్టల్ యొక్క నిర్మాణం నాణ్యత ఆహారం ఆరోగ్యం పరిరక్షించబడే విధంగాని ర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులు విద్యా, శాస్త్ర, సాంకేతిక, పరిశోధన, రాజకీయ రంగంలో అభివృద్ధి చెందే విధంగా ఉపాధ్యాయులు కష్టపడి వారిని తయారు చేయాలని సూచించారు. వ్యక్తిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి సమాజానికి సేవ చేయ విధంగా విద్యార్థులను తయారు చేయడం ఎక్కడైనా వారికి అన్యాయం జరిగితే వారికి న్యాయం చేసే విధంగా బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కామిని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి మామిడి విఠల్, కోశాధికారి బుడిగె కొండయ్య, ఉపాధ్యక్షులుగా పరుశురాములు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, స్రవంతి, వెంకట రాములు, మోడల్ స్కూల్ ప్రతినిధి జమల పురం రామకృష్ణ పాల్గొన్నారు.

## విశ్వశాంతికి ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం: జగదీశ్వర్‌గౌడ్



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్,పార్టీ ప్రముఖులు

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 25 ప్రభాతవార్త**

విశ్వశాంతిని కాంక్షించే పరోపకారులైన ప్రతి ఒక్కరికీ ఏసుబోధనలు అనుసరణీయమని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలోని కాంగ్రెస్‌పార్టీ ఇంచార్స్ జగదీశ్వర్‌గౌడ్ కార్యాలయంలో నియోజక వర్గ నాయకులు సౌందర్యరాజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో నియోజక వర్గ కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డితో కలిసి జగదీశ్వర్‌గౌడ్ క్రిస్మస్ కేక్ కట్‌చేసి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించమని చెప్పిన ఏసు బోధనలు విశ్వమానవాళికి మార్గదర్శకమన్నారు. కాంగ్రెస్ పాలనలో క్రిస్టియన్, మైనార్టీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆదుకుంటున్నారన్నారు. ఏసుక్రీస్తు నేర్పిన మార్గంలో కాంగ్రెస్‌పార్టీ ప్రజా ప్రభుత్వం సర్వమత హితంగా పరిపాలన చేస్తుందన్నారు. అన్ని మతాల ప్రజల అభివృద్ధికోసం ప్రజా ప్రభుత్వం స్థిర సంకల్పంతో కట్టుబడి పనిచేస్తుందన్నారు. గంగా,యమున సంస్కృతి, ఫరిడవిల్లే విధంగా,మత సామరస్యం వెల్లివిరిసేలా సర్వమత సమానత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డిజిల్లా డీసీఈ ఉపాధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, ఉరిటి వెంకట్రావు, హరికిషన్,సన్నీ బెనర్జీ,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సాయి కిశోర్, దుర్గేశ్, మూర్తి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## చింతల్ స్టార్‌లైట్ పక్కన ప్రభుత్వ భూమి కాపాడాలి : రాజా సదానంద్



ప్రభుత్వభూమి కాపాడాలంటూ ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చింతల్ డివిజన్ బీజెపి అధ్యక్షులు పత్తి సతీష్, రాజా సదానంద్, ప్రతాప్‌రెడ్డి, నల్ల జైశంకర్‌గౌడ్ తదితరులు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 25 ప్రభాతవార్త**

ప్రభుత్వభూమిని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నవారిపై చర్యలు చేపట్టి ప్రజా ప్రయోజనాలకు ప్రభుత్వ భూమిని కాపాడాలని చింతల్ డివిజన్ టిఆర్‌ఎస్ అధ్యక్షులు పత్తిసతీష్ , సీనియర్ నాయకులు కొట్టే రాజ సదానంద్ విజ్ఞప్తిచేశారు. ఈమేరకు మల్కాజ్‌గిరిలోక్‌సభ సభ్యులు ఈటెల రాజేందర్‌కు చింతల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు పత్తిసతీష్, చింతల్ డివిజన్ సీనియర్ నాయకులు కొట్టే రాజా సదానంద్, నల్ల జైశంకరగౌడ్, ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ రెవెన్యూ మండలపరిధి సర్వేనెంబరు 148లో గల ప్రభుత్వస్థలాన్ని మొత్తం 29ప్లాట్లుగా విభజించి అమాయకులకు విక్రయిస్తూ కోట్ల రూపాలయ ప్రభుత్వస్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఈటెల రాజేందర్‌కు వివరించారు. ఈ స్థలాలకు బవిషత్‌లో ప్రభుత్వపరంగా పట్టాలు ఇస్తామని చెబుతూ ప్రజలకు మోసంచేస్తున్నట్లు వారు వివరించారు. ఈసందర్భంగా ఎంపి ఈటెల రాజేందర్ సదరుస్థలాన్ని రక్షించేందుకు శాయవక్తులా కృషిచేస్తానని మామీఇచ్చారు. బిజెపి యువజన నాయకులు ఆదిత్యకోడి, రామ్‌సాయి యాదవ్ పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు జే.రామకృష్ణ

**కంటోన్మెంట్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:**

దేశ ప్రధానిగా మాజీ ప్రధాని స్వర్గీయ అటల్‌బిహారీ వాజ్‌పేయి మార్గదర్శకంగా నిలిచారని కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు, బీజేపీ నేత జే.రామకృష్ణ తెలిపారు. జీజేవైఎం ఆధ్వర్యంలో షేనాయ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు శివాజీ పాల్గొన్నారు.

## ప్రజల దృష్టి మళ్లించేందుకే అల్లు అర్జున్ ఉదంతం

### -టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

**ముషీరాబాద్, డిసెంబర్ 25, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల నుండి ప్రజలను పక్కదోవ పట్టించేందుకే అల్లు అర్జున్ ఉదంతాన్ని తెరమీదకు తెచ్చారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. బుధవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జకోబ్ బాలనర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ప్రభుత్వం బెదిరించిన వారు తమకు లొంగితే అక్కడికక్కడ సెటిల్మెంట్ చేసుకుని, ముడుపులు, డబ్బులు దండుకుంటున్నారని, తమకు లొంగని వారిపై ఇష్టానుసారం చర్యలు తీసుకుని ఆందోళనకు గురిచేస్తున్నారని, గతంలో ఎన్.కన్వెన్షన్ విషయంలో కూడా ఇదే జరిగిందని ఆరోపించారు. మోహన్‌బాబు విషయంలో కూడా ప్రభుత్వం ఎక్కడ లేని ఆసక్తి కనబరుస్తోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవటంతో ప్రభుత్వంపై ప్రజలు నుండి తిరుగుబాటు ఎదురవుతుందని గ్రహించి ప్రజల దృష్టి మరల్చటానికి చేస్తున్న కార్యక్రమాలుగా ఆయన అభివర్ణించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్ప స్వాములను సన్మానిస్తున్న స్థానిక భక్తులు

**మెహిదీపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :**

స్వామియే శరణమయ్యప్ప... స్వామి శరణం అయ్యప్ప శరణం అంటూ భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో లంగర్ హౌస్ పరిసర ప్రాంతాలన్నీ అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగాయి. బుధవారం పెండ్యాల సురేష్ కుమార్, కత్తి స్వామి, రాఘవేంద్ర కృష్ణ, పెండ్యాల గిరి స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని మహేందర్ గురు స్వామి చేతుల మీదుగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యప్ప స్వాములతో పాటు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం స్వాములను శాలువాలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూజల్లో లంగర్ హౌస్ డివిజన్ నేతలు ఆనంద్, మాతంగి రమేష్, గోపిరెడ్డి నాగేంద్ర ప్రకాష్ రెడ్డి, ఆమంచి శ్రీకాంత్, అరవింద్, భోగి బాల దాస్, జె న్న సుధాకర్, రామచందర్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడి అరెస్టు

**మలక్ పేట ,డిసెంబరు 25, ప్రభాతవార్త:**

యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన మలక్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ నరేష్ కథనం ప్రకారం ముసారాంబాగ్ శాలివాహన నగర్‌లో నివసిస్తున్న యాదమ్మ కుమార్తె విజయలక్ష్మీ (24) తన ఇంటి పై భాగంలోకి వెళ్ళగా అదే సమయంలో పక్క ఇంటిలో నివసిస్తున్న వెంకట్ (30) ఒక్కసారిగా కత్తితో ఆమెపై దాడి చేశాడు .తనను ప్రేమించమని, వివాహం చేసుకోమని భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని లేని పక్షంలో చంపివేస్తానని వెంకట్ యువతని బెదిరించడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## వృద్ధులకు పండ్లు పంపిణీ



జైన్ మందిర్ లోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేస్తున్న గంగాపురం కావ్య రెడ్డి

**మెహిదీపట్నం, డిసెంబర్ 25, ప్రభాతవార్త :**

భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి వేడుకలను పురస్కరించుకొని బుధవారం గుడిమల్కాపూర్ జైన్ మందిర్ లో బిజెపి నగర కార్యవర్గ సభ్యులు దేవర వంశీ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి సతీమణి గంగాపురం కావ్యరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అటల్ బిహారీ వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. అటల్ బిహారీ వాజ్ పేయి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఆయన జయంతిని సుపరిపాలన దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చింతల్‌లో అటల్ బిహారీ వాజ్‌పేయ్ జయంతి

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 25 ప్రభాతవార్త**

స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పాయ్ చూపినమార్గంలో నడిచేందుకు ప్రతిభారతీయుడు కట్టుబడి వుండాలని గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు అన్నారు. స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పాయ్ శత జయతి ఉత్సవాలను చింతల్ శ్రీసాయికాలనీలో డివిజన్ బిజెపి అధ్యక్షులు పత్తి సతీష్, కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, బిజెపి సీనియర్ నాయకులు కొట్టే రాజా సదానంద్ ఆధవర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ రావుల శేషగిరిరావు మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్మరించుకునే నాయకుడు కేవలం అటల్‌జీయే నని కొనియాడారు. ఈసందర్భంగా అటల్‌జీ అమర్‌రహె అంటూ నినాదాలు చేస్తూ సంతాపం ప్రకటించారు. సమావేశంలో యువజన నాయకలు ఆదిత కోడి, రాంసాయి యాదవ్ పాల్గొన్నారు.

## నైతిక విలువలను ప్రపంచానికి చాటిన వాజ్‌పేయి

### -మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు



మెగా మెడికల్ హెల్త్ క్యాంప్‌లో మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**చార్మినార్,డిసెంబరు 24 ప్రభాతవార్త :**

భారత రత్న,భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి భారత దేశ వైభవాన్ని,నైతిక విలువలను ప్రపంచానికి చాటారని మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు అన్నారు. భారత రత్న, మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారి వాజ్‌పేయి 100 వ జయంతి సందర్భంగా చార్మినార్ నియోజకవర్గం పరిధి దారుషిఫా మైదానంలో బుధవారం రాష్ట్ర బిజెపి మెడికల్ సెల్,కామినేని ఆసుపత్రి, సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెడికల్ హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు.అంతకు ముందు మాజీ ముఖ్యమంత్రి ఎన్‌భాస్కర్ రావు మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారి వాజ్‌పేయి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కర్‌రావు మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప రాజ నీతిజ్ఞుడని తెలిపారు.విదేశాలలో ఉద్యోగాలు కల్పనకు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అద్భుతమైన చొరవ తీసుకున్నారని,ఆయన దేశానికి చేసిన సేవలను మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు కొనియాడారు.మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ మాట్లాడుతూ ఒక్క ఓటుతోనే అధికారాన్ని చేజార్చుకున్నారని,మాజీ బిహారీ వాజ్‌పేయి హయాంలో దేశం ఎంతగానో అభివృద్ధి చెందిందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్‌ఫిరాసత్ అలీ బాక్రీ, చార్మినార్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి ఎస్.ప్రవీణ్ కుమార్,బిజెపి నాయకులు శ్రీధర్ యాదవ్, సత్యనారాయణ,ప్యారసాని వెంకటేష్,భగవతీ,వీరామణి,నిత్యా పారిక్,రాష్ట్ర బిజెపి మెడికల్ సెల్ ఇంఛార్జి డాక్టర్ సురేందర్,కో కన్వీనర్ డాక్టర్.భాస్కర్,మెడిసిన్ సెల్ ఫార్మాసీ రాజశేఖర్ గంగపుత్ర,కామినేని ఆసుపత్రి వైద్యులు మెడికల్ క్యాంప్ ఇంఛార్జి యాదగిరి,చార్మినార్‌కు చెందిన బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లిలో మాజీ ప్రధాని వాజపేయి శతజయంతి



**అత్తాపూర్ డిసెంబరు25, ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం, రాష్ట్ర బిజెపి నాయకుడు బొక్క బాల్ రెడ్డి ఆధ్వర్యంలో అటల్ బిహారీ వాజపేయి 100 వ శతజయంతి ఉత్సవాలు ఉప్పరపల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ,జనసంఘ్ వ్యవస్థాపక సభ్యునిగా,అత్యంత పిన్నవయసు ఎంపీగా,భారత దేశ చరిత్రలో కాంగ్రెస్ పార్టీ ని మట్టికరిపించి 5 ఏళ్ల ప్రధానమంత్రిగా ఉన్న అటల్ బిహారీ వాజపేయ్ గారి జీవితం బీజేపీలో ఉన్న ప్రతి ఒక్కరికి ఆదర్శం అన్నారు. దేశం,పార్టీ,తర్వాతనే తాను అనే బీజేపీ నినాదం మనసా వాచా కర్మణా పాటించిన నాయకుడు భారతరత్నం వాజపేయిఅని కొనియాడారు. దేశంలో ఎన్నో పార్టీలు పుడుతున్నాయి ఎన్నో పార్టీలు మాయమా అవుతున్న ఈ తరుణం లో జనసంఘ్ నుంచి మొదలుకుని భారతీయ జనతా పార్టీ ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా ఉంది అంటే దానికి వాజపేయి మహనీయుల కృషి కారణం అని బొక్క బాల్ రెడ్డి భావోద్వేగంతో చెప్పారు. ఈ కార్యక్రమంలో వై శ్రీధర్ ,కొమురయ్య ,మల్లేష్ యాదవ్ ,రాజశేఖర్, శ్రీకాంత్ రెడ్డి ,విట్టల్ బాలకృష్ణ ,పవన్ మల్లేచారి, ప్రకాష్ ,వెంకటేష్ ,శ్రీనివాస్ రెడ్డి ,వంశీ ,పవన్ సాగర్ ,నర్సింగ్ ,కర్ణాకర్, పెంటా రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు



క్రిస్మస్ పర్వదినంను పురస్కరించుకొని గంధంగూడ ఇందిరమ్మ కాలనీలో వీధిలైట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్, నాయకులు హరీష్‌గౌడ్, కాలనీ అధ్యక్షులు ధన్నాడ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సాయి తదితరుల దృశ్యం


IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, R.R. DISTRICT, AT: HAYATH NAGAR
O.S. No. 940 OF 2024

Between :
**Gudala Pentaiah and others** ...Plaintiffs

AND

**1. The Tahsildhar,** Hayathnagar Mandal, R.R. District
**2. All Concerned** ...Defendants

To,
**All Concerned**

It is hereby take notice that the plaintiffs herein have filed the above suit in the above mentioned court for declaration of legal heirs and successors of deceased Gudala Pochaiah who was died on 29-10-2007 and Gudala Narsamma who was died on 09-01-2008. The said matter is posted to **17-01-2025** for appearance of any objectionable persons. Therefore it hereby informed that if anybody having interest or claim on the legal heirs of said deceased person may appear in the above-mentioned court by 10:30 A.M., either in person or through an advocate on the above-mentioned date. If you failed to appear before the court, the Hon'ble Court would be decided the matter in your absence.

(BY ORDER OF THE COURT)
**Sd/- BANDI NARESH**
**ADVOCATE**
**Office At:** 4-2-86, Old Road, Hayathnagar, R.R. District,
**Cell: 9985771982**

### యేసు క్రీస్తు బోధనలు సదా అనుసరణీయం : పాస్టర్ సామ్యూల్ బాబు



బేతనియ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్న పాస్టర్ సామ్యూల్ బాబు తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 25, ప్రభాతవార్త:** ఏసుక్రీస్తు బోధనలు సదా అనుసరణీయమని బేతనియ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ సామ్యూల్ బాబు పేర్కొన్నారు. ముసారంబాగ్ కృష్ణ తులసి నగర్ లోని బేతనియా బాప్టిస్ట్ చర్చిలో చర్చి పాస్టర్ సామ్యూల్ బాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహనం, దార్శనికత, క్షమించే ఓర్పు మానవ సమాజానికి ఏసుక్రీస్తు చూపిన అద్భుతమైన శాంతి మార్గం అని వివరించారు. ప్రేమ కరుణ ద్వారా మానవాళి జీవితంలో ఆనందం, సంతోషాన్ని నింపిన ఏసుక్రీస్తు జీవితం అందరి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు బోధనలు మంచి నడవడిక గురించి తెలియజేస్తాయని వివరించారు. విశ్వ మానవులకు ప్రేమ సౌభ్రతత్వం పంచిన ఏసుక్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికి దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు. అదేవిధంగా చర్చిలో పలుభక్తి గీతాలను ఆలపించి వివిధ సంస్కృతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో దైవ ప్రార్థన నిర్వహించారు .ఈ కార్యక్రమంలో షీలాడోరాతి బైరపోగు, టీఎన్ జీవో మహిళా అధ్యక్షురాలు రేచల్ ,కిషోర్ బాబు, సన్నీ రెడ్డి పోగు, సత్యానందం, ప్రశాంత్, రేయు, స్వీటీ, సుదీర్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

### ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శం : పాస్టర్ ప్రభు చరణ్


క్రిస్టియన్ లైఫ్ సెంటర్ లో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న పాస్టర్లు ప్రభు చరణ్ ,వన్య ఇమ్మానుయేల్ తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 25, ప్రభాతవార్త:** ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శమని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్, సీనియర్ పాస్టర్ ప్రభు చరణ్, పాస్టర్ వన్య ఇమాన్యుల్ లు పేర్కొన్నారు. ముసారాంబాగ్ లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో వారి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి, కరుణ సహనం, ప్రేమ విలువలను ఏసుప్రభు ప్రపంచానికి చాటారాని పేర్కొన్నారు. సర్వ మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలు సత్యమార్గాన్ని అనుసరించాలని కోరారు. శాంతి, సోదరభావానికి ప్రతీక క్రిస్మస్ పండుగ నిలుస్తుందని తెలిపారు. ప్రేమ, కరుణ ద్వారా ఏసుక్రీస్తు మానవాళిలో ఆనందాన్ని, సంతోషాలను నింపారని పేర్కొన్నారు. అదేవిధంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చెసి పలు సంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

### ఏసుక్రీస్తు బోధనలు ప్రజలకు మార్గదర్శకం : పాస్టర్ మెన్నో జోయల్


బెత్లెహేమ్ మెన్నో నైట్ బ్రేతరెన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్న చర్చ్ సీనియర్ పాస్టర్ మెన్నో జోయల్ తదితరులు

**మలక్ పేట ,డిసెంబరు 25, ప్రభాతవార్త** ఏసుక్రీస్తు బోధనలు ప్రజలకు మార్గదర్శకమని బెత్లెహేమ్ మెన్నో నైట్ బ్రేతరెన్ చర్చి సీనియర్ పాస్టర్ డాక్టర్ మెన్నో జోయల్ పేర్కొన్నారు. బెత్లెహేమ్ మెన్నో నైట్ బ్రేతరెన్ చర్చిలో చర్చ్ సీనియర్ పాస్టర్ మెన్నో జోయల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ శాంతి, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. శాంతి, కరుణ, సహనం, ప్రేమ విలువలను ఏసుక్రీస్తు ప్రపంచానికి వివరించడం జరిగిందని, సర్వ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రజలు ధర్మమార్గాన్ని అనుసరించాలని తెలియజేయడం జరిగిందని వివరించారు. అదేవిధంగా భక్తులు పలు భక్తి గీతాలు ఆలపించడంతో పాటు వివిధ సాంస్కృతి కార్యక్రమాలను ఆనందోత్సవాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవ సహాయం, ప్రభుదాస్, మాణిక్యం, సామ్యూల్, విజయవర్ధన్, ప్రవీణ్ , జార్జి, రినా ఫ్లోరెన్స్ యేసు, రవికుమార్, జాన్సన్, సుకుమార్, ఏజే ఏసు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

## భారతరత్న వాజ్‌పేయికి ఘన నివాళులు


వాజ్‌పేయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 25 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని, భారతరత్న అటల్‌బిహారి వాజ్‌పేయి శత జయంతిని ఐఎస్ సదన్ డివిజన్ శివాజి చౌక్ నాగార్జున కాలనీ కమాన్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి హాజరయ్యారు. వాజ్‌పేయి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్, అమర్నాథ్‌రెడ్డి, రేణుక ముదిరాజ్, సరిత రెడ్డి, రమాదేవి, సుష్మ, డివిజన్ బిజెపి అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### లిటిల్ లాంబ్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకలలో గీతాలాపన చేస్తున్న క్రిస్టియన్ సోదరీమణులు

**వనస్థలిపురం డిసెంబరు. 25.ప్రభాతవార్త :** వనస్థలిపురం లోని లిటిల్ లాంబ్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ సోదర సోదరీమణులు ఒకరినొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.క్రిస్మస్ కేక్ ను కట్ చేసి పంచుకున్నారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు బోధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు టి.ఎస్. బాబూ రావు, జార్జ్ ముల్లర్,భాను కిరణ్,ఎన్. జాన్ జయదాస్, సురేష్ కుమార్,జాకబ్ ప్రసాద్,రఘురాం,కాంత రమేష్,విజయలక్ష్మి లాజరస్ తదితరులు పాల్గొన్నారు.


వాజ్ పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మీ తదితరులు



మాజీ ప్రధాని వాజ్ పేయికి నివాళులు అర్పిస్తున్న లచ్చిరెడ్డి తదితరులు



మాజీ ప్రధాని వాజ్ పేయి నివాళులు అర్పిస్తున్న బి.జె.పి.నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి,నీళ్ల అంజనకుమార్ గౌడ్,నూతి శ్రీనివాసరావు, కాటం క్రాంతి గౌడ్,చిన్నా యాదవ్ తదితరులు.


చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌యాదవ్


నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్


రామంతాపూర్‌లో మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు


ఉప్పల్‌లో జరిగిన మాజీ ప్రధాని శతజయంతి వేడుకల్లో పాల్గొన్న మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి తదితరులు


బాలాపూర్ చౌరస్తాలో మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న శంకర్‌రెడ్డి: చిత్రంలో ఎద్ల మల్లేష్ ముదిరాజ్, ఇంద్రావత్ రవినాయక్, జిల్లెల ప్రభాకర్‌రెడ్డి తదితరులు


నాదర్‌గుల్‌లో వాజ్‌పేయికి పుష్పాంజలి ఘటిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్: చిత్రంలో చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, మర్రి అంజిరెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు



మీర్‌పేట్ చౌరస్తాలో వాజ్‌పేయి జయంతిని నిర్వహిస్తున్న పెండ్యాల నర్సింహ, కోడూరు సోమేశ్వర్, గాజుల మధు తదితరులు

# అటల్ బిహారీ వాజ్‌పేయికి నివాళి

**కృష్ణ తులసి నగర్ కమ్యూనిటీ హాల్‌లో...**

**మలక్ పేట ,డిసెంబరు 25, ప్రభాతవార్త:** దివంగత మాజీ ప్రధాని వాజ్ పేయ్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని ముసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. డివిజన్ లోని కృష్ణ తులసి నగర్ కమ్యూనిటీ హాల్ లో వాజ్ పేయ్ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి నూతన దశ, దిశ అందించిన మహోన్నత వ్యక్తి వాజ్ పేయ్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు సందడి సురేందర్ రెడ్డి, తిరుమలరెడ్డి, రమేష్ రెడ్డి, గౌర దేవేందర్, యాదగిరి సురేందర్ , కొంగర ప్రవీణ్ ,కొప్పుల దినేష్ ,సదానంద్, తులసి ,పరుశురాం , మల్లేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

**సచివాలయ నగర్‌లో...**

**వనస్థలిపురం. డిసెంబరు.25.ప్రభాతవార్త :** మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి వేడుకలలో భాగంగా బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధి లోని సచివాలయ నగర్ రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస రెడ్డి హాజరై ఆ మహనీయునికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... భారతదేశ ప్రజలందరికీ సుపరిపాలన దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు కొంతం నవ కిషోర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, కాలనీ అధ్యక్షులు కూర్మారావు, పురుషోత్తం రెడ్డి,సుధాకర్ రెడ్డి, పంపన వెంకటేశ్వర్లు, దామోదర్ రెడ్డి, చిత్రాంజన్, సత్యనారాయణ, రామయ్య, లక్ష్మారెడ్డి, జ్ఞానేశ్వర్, కాశీ రెడ్డి, ప్రభాకర్,శ్రీధర్ మరియు పార్టీ నాయకులు రఘురాం నేత, శంకరయ్య గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రావు, రవిశంకర్, జైపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి,చందు, శివశంకర్ గౌడ్, నరసింహారెడ్డి, పవన్ రెడ్డి,శ్రీనివాస్, రాజేందర్ ప్రసాద్ ,గౌరీ శంకర్, విజయ్, మురళి, శివకుమార్, ప్రేమ్,శ్రీధర్ రెడ్డి,దుర్గాప్రసాద్, బాల భాస్కర్, లతిష్, వికాస్, యశ్వంత్, శ్రవణ్ కుమార్, మరియు తదితరులు పాల్గొన్నారు.

**నాగోల్ డివిజన్ బిజెపి కార్యాలయంలో..**

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:** లోకం మెచ్చిన ఏకైక నాయకుడు మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పాయ్ అని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పేర్కొన్నారు.నాగోల్ డివిజన్ బిజెపి కార్యాలయంలో వాజ్ పెయ్ 100వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త అడుగులు వేయడానికి, ప్రయాణం చేయడానికి ఎప్పుడూ భయపడని వ్యక్తిత్వం ఆయన సొంతం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పంగ శ్యామ్‌కుమార్, బద్దం బాలకృష్ణగౌడ్, వస్పరి మల్లేష, పాల్వాయి సంజీవరెడ్డి, చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి, నరేష్ గౌడ్, రాజాచారి, రాధిక, సరస్వతి, వినోద్‌యాదవ్, మనోజ్‌కుమార్, సంతోష్, యశ్వంత్ పాల్గొన్నారు.

**సైదాబాద్ డివిజన్‌లో...**

**సైదాబాద్, డిసెంబరు 25 ప్రభాతవార్త:** మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని సైదాబాద్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి హాజరై వాజ్‌పేయి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో నైతిక విలువలకు కట్టుబడిన గొప్ప నాయకుడు వాజ్‌పేయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల హరిగౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కదారి రాంకుమార్ పాల్గొన్నారు.

**ఉప్పల్ సర్కిల్‌లో**

**ఉప్పల్, డిసెంబరు 25 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాజీ ప్రధాని స్వర్గీయ వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామంతాపూర్ నెహ్రూనగర్‌లో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ తదితరులు పాల్గొని వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని స్వర్గీయ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్,బుర్ర రాజేశ్వర్, ఉలుగొండ నారాయణ దాసు, సంకూరి కుమారస్వామి, ముత్తినేని జగదీష్, శాగ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**చిలుకానగర్‌లో..**

చిలుకానగర్‌లో బిజెపి డివిజన్ అధ్యక్షుడు గోనె శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకానగర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బిజెపి సీనియర్ నాయకులు గొరిగె కృష్ణ గోనె అంజయ్య, వైద్యుల వీరారెడ్డి, ప్రదీప్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కావలి నరసింహా, కంచర్ల భరత్‌రెడ్డి, శ్రీహరి, దాసరి యాదగిరి, కొండల్‌రావు, బొమ్మ రమేష్, గుర్రాల మల్లేష్, ఉపేందర్‌రెడ్డి, దప్పు దత్తసాయి, ప్రభావతి, మమత, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి మాజీ ప్రధాని వాజ్‌పేయి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

**ఉప్పల్‌లో..**

ఉప్పల్‌లో బిజెపి డివిజన్ అధ్యక్షుడు రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, సీనియర్ నేతలు గొరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణగౌడ్, తీగ విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

## పార్కు స్థలాలు, నాలాల ఆక్రమణలు, అవినీతిపై ఎమ్మెల్యే దృష్టి సారించాలి

### - చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 25 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గడచిన కొన్ని సంవత్సరాలుగా యథేచ్ఛగా జరుగుతున్న పార్కు స్థలాలు, నాలాల ఆక్రమణలపై స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆక్రమణలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంలో హైడ్రాకు సహకరించాలని ఆయన అన్నారు. కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లోనున్న మహేశ్వరం నియోజకవర్గ భాజపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు సంబంధించిన ప్రధాన అంశాలను ప్రస్తావించారు. కార్పొరేషన్‌లోని గాంధీనగర్ కూడలిని విస్తరించి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించడాన్ని స్వాగతిస్తూ అభినందిస్తున్నామని వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే 150 ఫీట్ల రేడియల్ రోడ్డు ప్రతిపాదన ఉండగా కార్పొరేషన్‌లో రోడ్డు పక్కన ఉన్న ఆస్తులకు నష్టం కలుగుతుందని కార్పొరేషన్ వారు 100 ఫీట్లకు కుదించి తీర్మాణం చేస్తే దానిని ప్రామాణికంగా చేసుకొని కార్పొరేషన్ బిల్డింగ్, జిల్లా గ్రంథాలయం, మున్సిపల్ గ్రౌండ్ తదితర వాటిని నిర్మించారని వెల్లడించారు. కార్పొరేషన్‌లో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాలతో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని ఆయన వెల్లడించారు. ఇక పోతే ఎస్ఎన్‌డిపి నాలాల విషయానికి వస్తే వందల కోట్లతో చేపట్టిన పనులకు శంకుస్థాపనలు జరిగినా నేటికి చుక్క నీరు పారలేని పరిస్థితి ఉందని ఆయన తెలిపారు. స్వంత బిఆర్ఎస్ పార్టీ వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లోనే నాలాల సమస్యలు ఉన్నందున వాటికి శాశ్వత పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లో ప్రజోపయోగార్థం లేఔట్ల లో వదిలిని ఖాళీ స్థలాలను, పార్కు స్థలాలను కబ్జాలు చేసి భవనాలు నిర్మిస్తున్నారనీ సదరు స్థలాల గురించి తెలిసి మరీ బడా బాబులు యదేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై తాము హైడ్రాను ఆశ్రయించడం జరిగిందని ఆయన వెల్లడించారు. కార్పొరేషన్‌లో అవినీతి, ఆక్రమాలు ఉన్నందున ఎమ్మెల్యేగా స్పందించాలని ఆయన కోరారు. హైడ్రా చర్యలకు సహకరించాలని వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.

### పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ : జేరుసేలం మత్తయ్య


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జేరుసేలం మత్తయ్య తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 25 ప్రభాతవార్త :** ఉప్పల్ గాంధీనగర్‌లోని జేరుసేలం ప్రేయర్ మినిస్టీస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జేరుసేలం మత్తయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికి మార్గనిర్దేశనం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ పి.జాన్, క్రైస్తవ ధర్మ ప్రచార సమితి అధ్యక్షుడు జేరుసేలం మత్తయ్య, జోస్పిన్, ఏనోషు, బాబు, ఎల్బెట్, హప్పిభ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

### బాలాజీనగర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు


కేకు కట్ చేస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, డిసెంబరు 25 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 13వ డివిజన్ మల్లాపూర్ బాలాజీనగర్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సుజన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కేకు కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్ పాషతో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

### మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు


ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం

**ఉప్పల్, డిసెంబరు 25 ప్రభాతవార్త :** వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉప్పల్ మినీ శిల్పారామంలో సాత్విక శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మహాగణపతిమ్, లింగాష్టకం, బాలకనకయ్య, చిన్న శివవు, అన్నపూర్ణ,అల్లో నేరల్లో, పేరణి కాత్యం, వారాహి, అష్టలక్ష్మి,గరుడ గమన తదితర అంశాలను కళాకారులు స్పూర్తి, నిత్యశ్రీ, గగనశ్రీ, సాన్విక, యోషిక, జూషిత, సహస్ర, ప్రణవి, మనస్వి తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

### బడంగ్‌పేట్‌లో కనుల పండువగా అయ్యప్ప పడి పూజ


పడిపూజకు హాజరైన సబితారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కార్పొరేటర్ భీమిడి స్వప్నా జంగారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 25 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ గ్రామంలోనున్న గౌర మల్లేష్ రాములమ్మ ఫంక్షన్ హాల్‌లో కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజ కనుల పండువగా జరిగింది. మాల ధారణ చేసిన సందర్భంగా భీమిడి జంగారెడ్డి గురుస్వా మి పడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ పూజకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. అదే విధంగా మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, పలువురు కార్పొరేటర్లు కూడా హాజరయ్యారు.

### క్రిస్మస్ వేడుకల్లో మల్‌రెడ్డి రామ్ రెడ్డి



**తుర్కయంజాల్ డిసెంబర్ 25 ప్రభాతవార్త :** క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ ఇషాకర్ ఆధ్వర్యంలో షేకినా ఫెలోషిప్ చర్చ్ లో బుధవారం ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రామ్ రెడ్డి హాజరైయ్యారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ క్రిస్టియన్ సమాజానికి పవిత్ర క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి ఎంతో బలమైందని.కుల, మతాలకు అతీతంగా ఇక్కడ అందరికీ గౌరవం ఉంటుందని తెలిపారు. క్రిస్టియన్ మిషనరీలు నడిపిస్తున్న స్కూళ్లు, ఆస్పత్రుల గురించి అభినందించారు. ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేర్చేలా బాధ్యతగా పని చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త కుర్మా శివకుమార్, కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సువర్ణ రాజు గౌడ్, తుర్కయంజాల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుత్త వెంకట్ రెడ్డి, పాండు రంగ, రాజేష్ గౌడ్, గంగాధర్, కే మధుసూదన్ రెడ్డి, మాధవరెడ్డి, కుమార్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర యువజన కాంగ్రెస్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా జక్కిడి శివ చరణ్ రెడ్డి


శివ చరణ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఉదయ్ భాను

**మన్సూరాబాద్, డిసెంబర్ 25, ప్రభాతవార్త :** గత ఆగస్టు మరియు సెప్టెంబర్ లో జరిగినా యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో 2 లక్షల 16 వేయిల 115 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించిన జక్కిడి శివ చరణ్ రెడ్డిని ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా అధికారికంగా ప్రకటించి, నియామక పత్రాన్ని జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను ఛిబ్ అందజేశారు. ఈ సందర్భంగా జక్కిడి మాట్లాడుతూ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరియు యువత ను భాగస్వామ్యం చేస్తూ ప్రభుత్వనికి అండగా ఉంటామని అన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

### అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**సరూర్‌నగర్, డిసెంబరు 25 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్ బాలాజీ నగర్‌లో విద్యుత్ షాట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబానికి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు ఆమె బాధిత మహిళ లోఖ్యకి రూ.20 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నరి సింహారెడ్డి, 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు కొండా శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:** అయ్యప్పస్వామి మహా పడిపూజ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. మహా పడిపూజ సందర్భంగా చైతన్యపురి రక్షిత హాస్పిటల్ అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కన్సల్టేషన్, రక్త పరీక్ష, ఈసీజీ, ఎముకల సాంద్రత పరీక్ష లను నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్స్ స్వాతి, విష్ణువర్ధన్, కృష్ణ ప్రకాశ్, మేనేజర్లు గడ్డం సత్యనారాయణ, సంతోష్ హాస్పిటల్ సిబ్బంది, కపిల్, హుస్సేన్, మల్లేష్, వర్ష, ప్రమీల, సిద్దు , శ్రవణ్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

### వాజ్‌పేయ్ జయంతి సందర్భంగా దుప్పట్ల పంపిణీ


వాజ్‌పాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పవన్ కుమార్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ సప్తగిరి కాలనీలో డివిజన్ బిజెపి అధ్యక్షుడు మంచి రాజేష్ ఆధ్వర్యంలో నాయకులు బొల్గం సాయినాథ్ సహకారంతో భారత రత్న భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ 100వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సప్తగిరి కాలనీలోని వృద్ధాశ్రమం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. వాజ్‌పాయ్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త తిరుమల, తోట మహేందర్‌యాదవ్, రింకుగౌర్, చందు వెంకట్‌రెడ్డి, రాధిక, వైజయంతి, లావణ్య, గీతారెడ్డి, నరసింహ, శివనేత, లావణ్య, పాల్గొన్నారు.

### రామంతాపూర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు


రామంతాపూర్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 25 ప్రభాతవార్త :** రామంతాపూర్ చర్చికాలనీ లోని లూర్దుమాత చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకలకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమానురాగాలను పంచుతుందన్నారు. ప్రేమ, క్షమాగుణం తిరిగి భూమిపై పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ దినేష్, శాస్త్రి ప్రాన్సిస్, సుధాకర్ పోలిశెట్టి, బొక్కా సురేష్, రత్నారెడ్డి, మారిరెడ్డి, ఎం.భాస్కర్, డేవిడ్, సతీష్, రోజ్ మేరి, వినయ్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.